# సిటీలైట్స్..

## ఇతనుతెలుసామీకు?



ఇతనెవరో తెలుసా సార్ మీకు ? పాపం మీరు గమనించి ఉండకపోవచ్చు-స్కూటరు మీద కూర్చుని మీరు వెనక ప్రియురాల్ని ఉంచుకుని జామ్మంటూ రోడ్డుమీద జారిపోతూ మీరు, మీ ప్రియురాలి 'విష్'ని తీర్చటానికై రోడ్డు పక్క ఏ ఐస్‌క్రీం షాపు వద్దో, కూల్‌డ్రింకు బండి వద్దో బండినాపి, ఆమెతో పాటు దిగి, పర్సులోంచి డబ్బులు తీసి అలా అలవోకగా షాపువాడికచ్చి, సుతారంగా వాడిచ్చిన థమ్స్ అప్ బాటిల్స్‌నో లేక త్రిల్లో, స్ప్రింటో, సోమా సీసాలనో అందుకుని, ఒకదాన్ని మీ ప్రియురాలికి అందించి రెండోదాన్ని స్టయిలుగా మీరు నోటికి అనించుకుంటున్న సమయాన అతను మీకు దగ్గరలోనే రోడ్డుమీద నిలబడి ఉండవచ్చు-చేతిలో ఫైలుతో, జేబులో పెన్నుతో, అలిసి సొలసి ఉసూరుమంటున్న మొహంతో-పాపం మీరతణ్ణి గమనించి ఉండకపోవచ్చు !

మీ ఆయన పక్కనే చిలకల కొలికిలా షోగ్గా కదుల్తాపోయే అందాల అతివా, నువన్నా గమనించావా అతణ్ణి-మీ ఆయన కొని ఇచ్చిన పూల చెండుని జడలో తురుముకుని ఆయన పక్కనే ఆయన్తో పాటు కదుల్తూ, చూడబోయే సినిమాని తల్చుకుంటూ, కెక్కెక్కె మనుకుంటూ, గజ్జెల గుర్రంలా పిరుదుల్ని ఎగరేస్తూ, కొమ్ముల్ని అదిలిస్తూ నువలా పేవ్మెంటు మీద నడుస్తున్న వేళ అతడు నీ పక్కనుంచి కదిలి ముందుకు సాగిపోయి ఉండవచ్చు-అరిగిన చెప్పులతో, నలిగిన బట్టలతో, చెదరిన క్రాపుతో-పాపం నువా దౌర్భాగ్యుణ్ణి గమనించి ఉండవు !.

ఏ చీకూచింతా వంటబట్టని చిలిపి బులుపు చూపుల కాలజే కన్నియా మరి నువన్నా చూశావా అతణ్ణి ? పాపం నువ్వూ చూసి ఉండకపోవచ్చు-నీతోటి ఈడు జంటల పక్కనే నీవు తుళ్ళుతూ పేలుతూ కబుర్లు చెప్పుకుంటూ మిథున్‌చక్రవర్తి గురించో కమల్‌హాసన్ చక్రవర్తి గురించో విజయశాంతి గురించో సుహాసిని గురించో తమరు పొగుడుతూ పేట్రేగుతూ, కిలకిలా కలకలా నడుచుకుంటూ పోతున్న వేళ అతడు మీ పక్కనుంచే నడుచుకుపోయి ఉంటాడు-పీక్కుపోయిన కళ్ళతో, నొక్కుకుపోయిన చెంపలతో, వాడిలిపోయిన చర్మంతో-పాపం మీ అందాల కళ్ళకు ఆ నిర్భాగ్యుడు అని ఉండకపోవచ్చు !!!

అలాంటి అతను- చేతిలో ఫైలూ, జేబులో పెన్నూ, హవాయి చెప్పులూ, అరిగిన అడుగులూ, నలిగిన దుస్తులూ, చెదిరిన జుత్తూ, బెదిరిన మొహమూ కల అతను-కళ్లు పీక్కుపోయీ, చెంపఎముకలు తేలీ, ముసలివోడిన చర్మమూ కల అతగాడు-అలా అలా రోజూ నగరం రోడ్లను సర్వే చేస్తుంటాడండీ-ఉద్యోగం కోసం, ఆదిచ్చే భద్రత కోసం, దాన్నిచ్చే నాథుడి కోసం వెతుకుతూ వెతుకుతూ....

అతని పేరు సుబ్బారావు కావచ్చు, శాస్త్రి కావచ్చు, శర్మ కావచ్చు, శంకరరావు కావచ్చు, జాన్ ముత్తయ్య కావచ్చు, క్రిస్టోఫర్ కలకయ్య కావచ్చు. ఎవరైనాగానీ అతనో నిత్య నిరుద్యోగి, గర్భ దరిద్రోగి-నగరమేదో ఉపాధి కల్పిస్తుందనీ, బ్రతుకును వొడ్డున పడేస్తుందనీ పీకదాకా ఆశతో వొచ్చి పడ్డాడీ నట్టనడి సముద్రంలోకి-

ఇంటివద్ద అతని అమ్మా, అక్కా, చెల్లీ, తమ్మీ, తండ్రి తాతా, అంతా అతనేదో మాయా జాల మంత్ర తంత్ర సమన్విత లోకంలోకి వెళ్ళాడనీ, ఓ గంధర్వుడుగా ఓ సగర్వుడుగా తిరిగి వచ్చి తమను కష్టాలను కడతేరుస్తాడనీ ఆశగా ఆత్రంగా ఆబగా ఎదురు చూస్తున్నారండీ-

మరి ఇతను ఇక్కడ ???

పొద్దున ఏమి తింటాడో తెలియదు, ఇలా రోడ్ల వెంటబడతాడు. ఈ మూల నుంచి ఆ మూలకు నడుస్తూ, నడుస్తూ మళ్ళీ నడుస్తూ నడుస్తూ, ఇంకా నడుస్తూ నడుస్తూ, అబ్బా కాళ్లు పీకుతూ, అమ్మా డొక్క ఎండుతూ, అయ్యో కళ తప్పుతూ, బక్క చిక్కి, బిక్కచచ్చి, తిరిగి వచ్చేస్తాడు నీరసంగా, నిరాశగా నిర్వేదంగా, నిరానందంగా....

## కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ఈ మధ్య అతని అనుభవాలు అపారం. ఎక్కే గడప ఎక్కుతాడు. దిగే గడప దిగుతాడు. అడిగే అర్థమైన ప్రశ్నలకూ సమాధానం చెబుతాడు. తలా తోకా లేని ప్రశ్నలు-సమాధానాలకు మట్టుకు తల ఉండాలి, తోకా ఉండాలి-అడిగే వాడికెప్పుడూ చెప్పే వాడు లోకువ కదండీ- మీరు కనక ఒక మూకీ చిత్రంలా లోపల జరిగే తతంగాన్ని చెవులు మూసుకుని కళ్లు తెరుచుకుని వీక్షించితే వాళ్ళ హావభావాల ద్వారా ఒక వింత దృశ్యాన్ని గమనించవచ్చు-ఇతగాడి కళ్ళలో బెదురునీ, ఈ ఉద్యోగాన్ని నాకే ఇవ్వరూ అనే ప్రాధేయతనీ, నాకిస్తారో ఇవ్వరో నన్న సంశయాన్ని, ఆందోళననీ, వాళ్ళ కళ్ళలో నిర్లక్ష్యాన్ని, మేము ముందే నిర్ణయించుకుని ఉన్నాము లేవోయ్ అనే కుటిలత్వాన్ని, అంతిమాన ఇక దయ చేయవచ్చుననే చులకన భావాన్ని, ఇలా ఎన్నింటినో ఎన్నింటినో....ఇలాంటి వాటిలో ఇతని కితను అప్రోచ్ అయ్యేవి కొన్నయితే ఇంటర్వ్యూలుగా పాల్గొనేవి కొన్ని-అన్నిటికన్ని ఫార్సులు, అన్నింటిలోనూ డేగా పామూ, పులీ లేడి, చిరుతా గోవూ, బోయా పావురమూ ఆటలే ఆటలు-

అనేక చోట్ల అతనికి అనేకమంది తనలాంటి వాళ్ళు తగులుతుంటారు. కొందరు రిజర్వుడు మనుష్యులూ, కొందరు కామందుల కొడుకులు, దర్పితులూ ధనికులూ, ఉద్యోగం అవసరం లేని వాళ్ళూ ఉన్నవాళ్ళూ-విచిత్రంగా ఎవరెవరికో వచ్చేస్తుంటాయీ ఉద్యోగాలు ఒక్క ఇతనికి తప్ప. ఒకోసారి అమ్మాయిలూ తటస్థపడుతుంటారు. తమరి పేరేమిటని అడుగుతాడితను. రమో ఉమో భ్రమోనని సమాధానం చెబుతుందామె. కొన్నాళ్ళ తర్వాత కాకతాళీయంగానో నాటకీయంగానో ఆ అమ్మాయి మళ్ళీ తగులుతుందతనికి అనుకోకుండా ఎక్కడో. అప్పటికామె కొంత స్టెయిల్‌గా చురుకుగా కళకళా మోముతో ఉంటుంది. ఉద్యోగం దొరికిందా అంటుంది. దొరక లేదంటాడితను. నాకు దొరికింది అంటుందామె. కంగ్రాట్స్ అంటాడితను. థేంక్యూ థేంక్యూ అంటుందామె మూతి తిప్పుతూ. అని నిష్క్రమిస్తుందిక. ఆమె ఇతణ్ణి వెంటనే మర్చిపోయి ఉండవచ్చుగాని ఇతను మాత్రం కొన్నాళ్ళపాటు కలలు కంటాడు-ఆమెతో తనకు పరిచయం పెంపొంది వృద్ధి చెందినట్లూ, తమిద్దరి మధ్యా ప్రేమ అంకురించినట్లూ, ఇద్దరూ డ్యూయెట్లు పాడుకున్నట్లూ, ఆమె ఉద్యోగం తనకు అసరాని కల్పించినట్లూ (అవును సార్ ఆ కలలో ఈ అంశము ఉంటుంది), తనకూ ఉద్యోగం లభించినట్లూ, ఇక రొమాన్సే రొమాన్సుగా, జీవితమే జీవితంగా, అలా అలా- మొత్తానికి అవి ఉత్త కలలే కాబట్టి త్వరలోనే అతడు భువి మీదకు దిగి రావాల్సి వస్తుంది, దిగి వస్తాడు. మళ్ళీ నైరాశ్యం, నిర్వేదనా, నిరుత్సాహమూ....

కొందరు నీ ఇంతకు ముందు ఏమాత్రం ఎక్స్‌పీరియన్స్ ఉందని అడుగుతారు. ఎక్స్‌పీరియన్స్. మై ఫుట్-ముండ నా కొడకల్లారా ఎక్స్‌పీరియన్స నేది ఎవడో ఒకడు ఉద్యోగం ఇస్తేనే గదరా వచ్చేదీ-నువ్వు ఇవ్వక, వాడూ ఇవ్వక, మరోడూ ఇవ్వక, మీరెవ్వరూ ఇవ్వకుండా ముందుగానే ఎక్స్‌పీరియన్స్ ఎక్కడి నుంచి వస్తుందిరా పుండాకోరు పుచ్చు వెధవల్లారా-మీ పెళ్ళాలూ, మీ కూతుళ్ళూ ఈ పిచ్చిసన్నాసి పక్కలోకి చేరా....

నిరుద్యోగం చాలా ఖరీదైనది సార్-దీనికి ఆహారం క్రింద మనిషి తన ఉద్వేగాలన్నింటిని ఖర్చుపెట్టాల్సి వస్తుంది. నిరాశ, నిరుత్సాహం, చాతకాని కసి, ఫ్రస్ట్రేషన్, ఇలాంటివన్నీ మనస్సును మెలికెస్తూ నులిమేస్తుంటాయి. రోడ్డు మీద నడుస్తున్నప్పుడు అతనికి తన చుట్టూ కదిలే మనుష్యులు, షాపులు, షోకేసుల్లో బొమ్మలు, మారుతీ కారుల్లో బొమ్మాయిలు, సుజుకీల వెనక అమ్మాయిలు, విసవిసలాడే ఆ నాగరికత, బెకబెకలాడే ఆ నాగరీకులు అదంతా విస్తారంగా వినూత్నంగా విలక్షణా కర్షణతో కనిపిస్తాయి. తన చుట్టూ ఉన్న ప్రదేశమంతా దేవలోకంగా గంధర్వలోకంగా, చుట్టూ తిరుగుతున్న వ్యక్తులంతా యక్ష కిన్నెర కింపురుషులుగా తనో మామూలు మాతృడుగా, వాళ్ళంతా అదృష్టవంతులుగా తానో నిరదృష్టుడుగా నికృష్టుడుగా అనిపిస్తారు. తానే పాపం చేయబట్టి ఇలా వికారంగా ఉండాల్సి వచ్చిందా అని రోదించుతాడు. ఆ రోదనా ఆ వేదనా ఉత్తవేస్టు మాత్రమే రొస్టు మాత్రమే....

రోడ్డు పక్క వాల్‌పోస్టర్లని చూస్తూ ఆ బాపతు సినిమాల స్టీరియో కథల్ని నెమరు వేసుకుంటూ అతనొకోసారి కలల్లోకి వెళ్ళిపోతుంటాడు. కారు తోలుతున్న ఏ అమ్మాయి కారు క్రిందో తను పడట్లూ, ఆ అమ్మాయి తనను ఇంటికి తీసుకుపోయి తనకు సపర్యలు చేసినట్లూ, తమ ఇద్దరి మధ్యా మధుర రొమాన్స్ చిగురించినట్లూ, ఆమె తనకు ఉద్యోగం ఇప్పించినట్లూ, తనను పెళ్ళి చేసుకున్నట్లూ, తనిప్పుడు కార్లో ఆమె పక్కనే కూర్చుని షికారు కొడుతున్నట్లూ, ఇలా ఇలా.... అంతలోనే అతని కడుపులో కదిలే ఆకలీ, నుదిటిమీంచి జారి కంటిలో పడ్డ స్వేదమూ, కాళ్ల పిక్కల్లో కదిలే సంకోచ వ్యాకోచ పీడనా, ఇవన్నీ అతడి కలల్ని చెరిపేస్తాయి. అతడిని నేలమీదకు నెట్టేస్తాయి. మళ్ళీ మామూలే....

ఒకోసారి అతని వద్ద డబ్బులుండవు. ఎక్కువగా అతనివి వొంటిపూట భోజనాలే. ఒకోసారి అదీ ఉండక చవకబారు బన్నును కొనుక్కుంటాడు. ఎంతకీ పళ్ళకి లొంగని ఆ బన్నుని పిచ్చికుక్కలా పీకి పీకి నములుతాడు. మధ్య మధ్య మింగుడు పడక నీళ్లు త్రాగుతాడు. శరీర పోషకత్వానికి కాక కడుపులో వెల్తి వెక్కిరించకుండా ఉండటం కోసమే ఈ తిండి !

ఒకోసారి తల్లినుంచో చెల్లినుంచో ఉత్తరం వస్తుందతనికి. చెల్లి సంబంధం తప్పిపోయినట్లు తెలుస్తుంది, తను ప్రేమించిన ప్రేమావతికి పెళ్ళయిపోయిందనీ తెలుస్తుంది. అతడి కళ్ళు నీటిని వర్షిస్తాయి. 'అమ్మా' అంటూ నిశ్శబ్దంగా ఆక్రోశిస్తాడతను. తనకు ఇప్పుడిక ఉద్యోగం దొరుకుతుందన్న ఆశ ఎటూ లేదు. తన జీవితం నాశనం అయింది. అందుకు సమాజమే కారణం! ఏ నేరమూ చేయకుండానే తాను జీవితాన్ని బలి పెడుతున్నాడు. తనతో పాటు తన తల్లీ చెల్లీ, తమ్ముడూ తండ్రీ, అంతా బలి అవుతున్నారు. ఉక్రోషం అతని స్వాంతాన్నన్నింటినీ ఆక్రమిస్తుంది. కసి అతడి నరనరాన్నీ వణికిస్తుంది. 'ఓరేయ్ !!!' అంటూ వెర్రిగా కసిగా క్రోధంగా అరుస్తాడతను. విలయతాండవానికి ముందు శంకరుడి రౌద్రంలా ఉంటుందది' ఆ ఉగ్రరవం అదృశ్యంగా నిశ్శబ్దంగా మెరుపు తీగలా సాగిసాగి భరత ఖండాన్నంతా ఆవరిస్తుంది. అతని పిడికిలి బిగుసుకుంటుంది. ఆ పిడికిలి మధ్య నుంచి మంటలు పుడతాయి. ఆ మంటల్లో రాజ్యాలకు రాజ్యాలు, పార్టీలకు పార్టీలు ఆహుతి అవటం మొదలెడతాయి. ప్రాంతీయతత్వం, పరదేశీయుల పారద్రోలటం, రిజర్వేషను, నక్సలైట్లు, తీవ్రవాదులు, టెర్రరిస్టులు వాళ్ళూ వీళ్ళూ, వీళ్ళూ వాళ్ళూ ఈ మంటల్లోంచి పుట్టుకొస్తారు. వొరేయ్ వొరేయ్, ముండనాకొడుకుల్లారా పిడికెడు కాస్త పట్టించుకోండిరా లేకపోతే మీరంతా మాడి మసయ్యిపోతార్రా....

●